PDF Compressor Pro

బృందావన ప్రసూనము - 8.

# శ్రీ లక్ష్మీ దివ్య గుణవైశిష్ట్యము

(శ్రీసూక్త - ఆంధ్రపద్యానువాద సహితము)

కవిశేఖర:
గురుజాడ రాఘవశర్మ

శ్రీ విశ్వావసు శ్రీ లక్ష్మీ జయంతీ మహోత్సవ ప్రసూనము
బృందావన పరిచరణములు
మచిలీపట్టణము.

PDF Compressor Pro

కవిసమ్మేళనము :– శ్రీ విశ్వావసు ఫాల్గుణ బ॥ ౭ భాను
వారము ఉదయము ది 13-3-66 ఘం 9-0 ల॥కు
శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయ ఆవరణలో (చల్లరస్తా)
శ్రీమత్పౌండరీకక్రతుయుత.
శ్రీ ల క్ష్మీ జ య న్తీ (షష్ఠ) వార్షికోత్సవ సందర్భమున

# శ్రీలక్ష్మీ దివ్య గుణవైశిష్ట్యము

అధ్యక్షులు : శ్రీ మహాకవి ఆవటపల్లె హనుమంతరావుగారు
కవులు : శ్రీదీక్షితదాసు నేను మల్లాప్రగడ జోస్యులు బృందావనము మొదలగువారు.

స్వీయం : ప్రవేశిక

శా॥ శ్రీలావణ్య మనోహరాంగు, మధురస్మేరాననున్ మోహన
శ్రీలోలత్కుచ కుంకుమాంకిత ఘనశ్రీవత్స వక్షోరుహున్
లీలా మానుషమూర్తి, భక్తవరదున్ బృందావనీ వేణుగో
పాలున్ సత్కరుణాలవాలు చరణాబ్జమ్ముల్ స్మరింతున్ మదిన్.

శా॥ తల్లీ, సద్గుణ కల్పవల్లి! త్రిజగత్ కల్యాణ సంపన్న భా
స్వల్లీ! నీదగు దివ్యవైభవ కళా ప్రాశస్త్యమున్ సత్కృపా
వల్లీ! పల్కగ నీమహస్థలికి, నాహ్వానించుట బ్రింబ, హృ
త్ఫుల్లాబ్జాక్షీ! మదీయశక్తి సకలమ్మున్ నీకు దెల్లంబగా!

మ॥ కవిసమ్మేళనయంచు బిల్చిరిటఁ బల్కఁగా, నినున్ గూర్చి, వే
దవిదుల్ మాన్య భిషగ్వరుల్ సకలశాస్త్రజ్ఞుల్ మనీషుల్ మహా
కవులానందముతోడ నేడు సలుపంగానౌ శ్రీజయంతీ మహో
త్సవమందున్ బలికింపు దివ్యగుణ వాత్సల్యైక సద్రూపిణీ!

PDF Compressor Pro



మ॥ పిలువన్ వచ్చిన వీరిస్వీయ కలితల్ విన్పింప విన్నాము ని
స్తుల భక్తిన్ విని శాల్వగప్రీతి మటంచున్ గొప్పగా జెప్పు ప
ల్కులకున్ బొంగక నీవె మమ్ముఁగృపఁగన్గో తల్లి వంచున్ మనం
బలరన్ బల్కదలంచినాము జగదంబా! లక్ష్మి! శ్రీభార్గవీ!

మ॥ మదికిన్ దోచిన యట్లుపల్కఁగ దలంపన్ దోకిర్ఘూడించి యి
య్యదియున్ యాహానుమంతు మోమ్రిల నిఖు సయ్యాటల్ వలెన్ దోచు పు
ణ్యదమున్ వేదగణ ప్రబోధితము విద్యాప్రాన్య సమ్మోద కీ
ర్తిదమున్ భక్తజన ప్రమోదిత జయంతీ దివ్యకార్యంబిదౌన్

ఉ॥ ఈసభ కూడునప్పటికి యెంతయొ కాలము మీఱెఁగాంచగా
వేసవియట్ల దోచు వినవేడుక గల్గినవారుకూడయెం
తేసహానమ్ముగల్గ వినసేర్తురె! యిప్పటికెందఱో యుప
న్యాసము సేయఁగావలెఁ బ్రియమ్ముగ సభ్యుల మోమ్రిల హాయిగా

గీ॥ తగిన కాలమ్ము లేద వ్యర్థము యువన్ని
తగినటుల్ బల్కుకున్న దండుగయె వక్త
తగిన మర్యాద లేద వృథాప్రయాస!
లలిత కళలకు తగిన కాలమ్ము లేద!

మ॥ కవి సమ్మేళన నేటికార్యమున కంగంబౌచు వర్తిల్ల యు
త్సవ నిర్మాతల జేతలంపు కలస్వేచ్ఛన్ బల్క కాలమ్మిటిన్
లవము న్జాలదు స్వస్వరూపమిక కండ్లన్ గట్టినట్టట్టులన్
ప్రవచింపందగు నైనశక్తికొలదిన్ బల్కన్ బ్రియత్నించెదన్

PDF Compressor Pro



అమ్మా! సకల కళానిల
యమ్మా! పాల్కడలిపట్టి యాశ్రిత జనభా
గ్యమ్మా! శ్రీనారాయణ
కోమ్మా! మాయమ్మలక్ష్మి కొలచెదనమ్మా

శ్రీ శ్రీ శ్రీ

## శ్రీ మ హా ల క్ష్మీ స్త వ ము

శా॥ శ్రీకల్యాణ మయస్వరూపిణి! జగచ్ఛ్రేయోభిసంవర్ధినీ!
లోకారాధిత దివ్య చిన్మయ కళల్ దూగాడు సమ్మోహితా
స్తోకానందరస స్వరూపిణి! జనస్తోత్ర ప్రమోదాత్త శీ
లా! కారుణ్య విలాససంపద మహాలక్ష్మీ! కటాక్షింపుమా

శా॥ తల్లీ! నీకను గొల్కులందునఁ బ్రశాంతమ్మున్ బ్రమోదమ్మురం
జల్లున్ జిన్మయ చిత్కళారుచులు వాసిన్ బర్వుచున్ దిక్కులం
దెల్లన్ గాఢ తమస్సు పోనడంచి హాయిన్ గూర్చెడిన్ సత్కృపా
వల్లీ! శ్రీమహాలక్ష్మీ! నీకిదె నమోవాకమ్ము లర్పించెదన్

శా॥ దారిద్ర్యాంధత బాపి సంతత సముద్యత్ భోగసౌభాగ్య వి
స్ఫారోదారరుచుల్ సమగ్రముగ సంవ్యాప్తంబగున్ నీదు స
త్కారుణ్యామృతవైభవాన్విత కటాక్ష శ్రీ బ్రసాదింప మే
లా! రమ్య ప్రతిభావిలాసిని! మహాలక్ష్మీ! కటాక్షింపుమా!

శా॥ శ్రీశుండంచు రమాధవుండనుచు లక్ష్మీకాంతుఁడం చెంతయేన్
బ్రాశస్త్యమ్ము వహించె నీవలన మానారాయణుఁడమ్మరో!
లేశమ్మున్ గనకున్న నీవిల మహాక్లేశమ్ములే కాదె! యే
లా! శంకింప త్వదీయ సత్కృప మహాలక్ష్మీ! మహాభాగ్యముల్

PDF Compressor Pro



శా॥ శ్రీకారమ్మె భవత్స్వరూపమునకున్ జిహ్వమ్మె నీదౌశుభ
శ్రీకారమ్ము స్మరించుమాత్రనె దారిద్ర్యాది పాపౌఘముల్
పోకారున్ స్థిరమైనదైహిక సుఖమ్ముల్ పూర్ణ సంశ్రేయముల్
సాకల్యంబుగఁ జేకుఱున్ గద! మహాలక్ష్మీ! కటాక్షింపుమా

మ॥ ధనమొక్కంటనె భోగికాడు యనుభవోందన్ సర్వభోగమ్ము లో
య్యనఁ జేకూర్చినవాడతండె! సకలాష్టైశ్వర్య సంపన్నదా
యిని! నీదా కరుణా కటాక్షముల హాయిన్ బొందువాఁడట్టి చ
ల్లని! శ్రీదేవి ననుగ్రహింపుము! మహాలక్ష్మీ! కృపాంకూరముల్

ఉ॥ పుట్టుకతోడనే సుకృతముల్ ఫలియించునటండ్రు నేటియా
పుట్టుకకూడ పూర్వకృతపుణ్య ఫలంబది పాలవెల్లువల్
పట్టుకులానఁ బాల్కడలిపట్టి సిరుల్ దొలకాడఁబుట్టి చే
పట్టితి శ్రీహరిన్ యనుగుబట్టిగ నన్ను యనుగ్రహింపుమా

ఉ॥ క్రిమ్మిన చిమ్మచీకటుల గ్రక్కునఁజీల్చి భయమ్ము వాపి లో
కమ్ములు కన్నులందెఱచి కన్గొన హాయినిగూర్చి పాలసం
ద్రమ్మున నుండి పెల్లుబుకు నాటి త్వదీయశరీరకాంతి పుం
జమ్ములు వెల్లువీనఁగ ప్రసన్న కళానిధి లక్ష్మినెన్నెదన్

ఉ॥ చల్లని వెన్నగల్గిన ప్రసన్న హృదబ్ధవు ముందు వెంబడిన్
బెల్లుబికెన్ వరమ్ములిడు వృక్షము ధేనువు వెల్ల యేనుగున్
చల్లనియశ్వమున్ సొబగుతీర్చిన యప్సరసల్ కళానిధుల్
తల్లి! యదృష్టమీవు సుకృతమ్మె స్వరూపముదాల్చె లక్ష్మివై

శా॥ దేవవ్రాతము సంతసింపనిల వ్యాప్తిన్ జెందె విద్యుత్ప్రభా
శ్రీవల్లి నటుల్ తళత్తళలు చుల్ శృంగారముప్పొంగ నీ
వావిర్భావము నొందుకాలమున మేలౌక్షీరవారాశి సం
భావింతున్ మహాలక్ష్మి దేవివిరో జగన్మాతా! సుఖోపేత!విన్

శా॥ దారిద్ర్యమ్ము హరించు దానవ్రుగ మాతా! సర్వసంపత్కరం
బై రాజిల్లి ఫలప్రదంబగును సర్వాభీష్టముల్ నీకృపా
శ్రీరంజిల్లఁబ్రమోదినీ! ధృతి! పవిత్రీరూపిణీ! దివ్యశృం
గారప్రోక్ష విలాసరూపిణి! జగత్కల్యాణి! శ్రీభార్గవీ!

చ॥ అవిరళభక్తలోక హృదయాంతరవర్తిని, దేవమాన్య! భా
ర్గవమునిపూజితా! సకలరాజ్య సమర్చిత పాదయుగ్మ రా
ఘవకవిసన్నుతా! సకలకార్య జయప్రద! కార్యకారిణీ!
ప్రవిమలరూపిణీ! ననుఁగృపన్ గనుమీ! జయలక్ష్మి! భార్గవీ!

మ॥ స్తవమున్ జేసెదను గ్రహింపగదె! మాతా! సర్వసౌభాగ్య భా
గ్యవతీ! విష్ణుసతీ జయీ భగవతీ! యానంద సంపన్నవై
భవసమ్మోదిని! చిత్కళాదళిత దివ్యప్రాభవోపేత కీ
ర్తివిరాజన్మణి! మోహపాశిని మహాదేవీ! జగన్మోహినీ!

శా॥ జాయాపుత్ర గృహాదిసఖ్యముల నిచ్చల్మున్గి తన్మోహమున్
బాయంజాలరు నీకృపన్ గలుగు సౌభాగ్యమ్ములం చెంతయున్
మాయారూపిణి! గుర్తెఱుంగరుగదమ్మా యెంతవారైన మా
దాయజ్ఞానము బాపరాగదవె మాయాచ్ఛేదినీ సత్కృపన్

ఉ॥ దేహికి లోటులేక గడతేరదు జన్మమెవారికేని సం
దేహమదేల! నీవు గరుణించిన వారలనోట నెన్నడున్
'దేహి'యటన్న పల్కువిననేరమటే! యటుగాన నిన్నె దా
సోహమటంచు నీశరణు జొచ్చెద హాయిసుభింతు మాతరో!

ఉ॥ నిస్తుల నిస్తరంగ కృపనింపెడు నీదుముఖాబ్జమందునన్
'నాస్తి' యటన్న పల్కది వినంబడనేరదు మించిసర్వదా
స్వస్తతజేకుఱున్ గద ప్రసన్నహృదబ్జవు మంగళాంగవున్
బ్రస్తుతిజేతు నిన్ బరులపై మననీయకు మమ్మ! తల్లిరో!

PDF Compressor Pro



ఉ. నీకృపగల్గువారికి కనీసము కూడును గుడ్డలోపముల్
లేకయె సాకుదీవట చలింపని సుస్థిర భూరి సంపదా
నీకము జేకుఱున్ బరుల నీచత వేడఁగరమ్ము జాపఁగా
నీక కరమ్మను గ్రహమునింపుమ నాపయి తల్లి! భార్గవీ!

ఉ॥ నిర్ణయమింత లేక యవినీతులకున్ వెలువంగఁబోక యే
దుర్ణయ కార్యమందుఁదలదూర్చెదరే యుదరమునింప సం
పూర్ణ ఫలప్రదాయిని వమూల్యము నీకృపయెంచి చూడ సౌ
వర్ణరుచుల్ పయిన్ బఱపు బంగరుతల్లివి, లక్ష్మివీ వెగా

ఉ॥ వెన్ను విదల్చినంత బ్రభవించె సుధాంసుయవస్తు సంపదల్
వెన్నుఁడు నీదుమూర్తి కనుపింపగ్రహించె ద్వదీయపాశి నీ
వెన్న జగద్విమోహినిగ నల్లెడ వర్ధిలు దానవమ్మ నా
విన్నపమాలకించి సరవిన్ గృపనింపుమ తల్లి నాపయిన్

ఉ॥ అన్నల మిన్నలందఱికి నందము చందముఁ బంచిపెట్టు సం
పన్న కుటుంబినీ! భువి విపన్న జనాంచిత సుప్రసన్న వి
ద్వన్నుత వేదసన్నుత కృపాపరిపూర్ణ జగంబటన్న నీ
కన్నను వేఱలేదు మముఁగన్న తరింతుము కన్నతల్లిరో!

ఉ॥ వెన్నెల దొంతరల్ దొరలు విస్తృతహా చిరునవ్వులన్ సదా
వెన్నెలరేనితోడఁ బ్రభవించిన వెన్నను మించు మేనితో
వన్నెల చిన్నవాని కరపద్మము బట్టుననంగతల్లి వీ
వెన్నఁగృపాప్రసన్న వుగదే కవిమన్న నగొమ్ము భార్గవీ!

సీ॥ ఎన లేనిభక్తి మహేంద్రుఁడర్పించె స
మర్హ్యమహా దివ్య సింహాసనమ్ము

పూర్ణకుంభముల సమ్మోదమ్మునన్ జేసె
దివ్యాభిషేకముల్ దిగ్గజములుఁ

సరసనంతోష వసంతుఁ డర్పించెను
ఫలపుష్పముల సమర్పణముఁ జేసిఁ

వేదవిద్వత్కోటి వినుతించె భక్తిపూ
ర్వకమగు స్వస్తివాచకచయమ్ము

పరవశులై హాయిపాడిరి గంధర్వ
కాంతలు మంగళగానములనుఁ

అభిషేకయోగ్యమైనట్టి యోషధుల మో
దించియర్పించె భూదేవిభక్తిఁ

హర్షముప్పొంగఁగా వర్షించెఁబోదుగుల
కొల్లగా గవ్యముల్ గోగణమ్ము

పాలకడలిరాజు పట్టుచీరలొసంగె
వరుణుండు మాల్యమున్ వరుసగూర్చెఁ

విశ్వకర్మయొసంగె వివిధ భూషణములు
రమ్యహారములు శారదయొసంగెఁ

పద్మభవుడొసంగె బద్మమ్ములన్ బ్రేమ
మణికుండలము నాగ గణము వెట్టెఁ

గీ॥ అందమగు సుందరముఖార విందమొప్ప
సిగ్గు లొల్కఁగఁజిఱు నవ్వు చిందులాడఁ
గ్రొత్తచెలువొప్ప మాటికిఁగులుకుఁజిలుకఁ
దళుకుబంగారు మేన (తల్లి) పూదండబూని
శ్రీమహాలక్ష్మి హారికంఠ సీమ నింప

సీ॥ వాగమృతము నిండ వర్షించెదమ్మరో
బ్రహ్మతో సేయు సంభాషణలను

వెల్లిపొంగెదు జగద్వల్లభుగూడి సా
యగను పాణిన్ గ్రహియించుపట్ల

ధన్యజన్మమనుచుం దలచెదు సర్వజ్ఞ
మూర్తితోడ నేకముగనుం జేర

దివ్యనిధులు ద్వారలు తీసినపొంగి తూ
పులను జిమ్మెదు వాలుచూపులందు

గీ॥ శ్రీమనివారకమయినట్లు సంతసించు
ముద్దులొల్కెడి చిఱునవ్వు మోముగాంచి
అమృతపదనుగుగాదె మాయమ్మ! మృదు ప
దమ్ముసోకిన యెట్టి గృహమ్ము కాని

శా॥ శ్రీనారాయణుడెట్టివాడొ గ్రహియించెన్ లోకమీనాడు ల
క్ష్మీనారాయణుడన్న పేరుంగొనె వాసిన్ నీకరాబ్జమ్ముం జే
బూనన్ మన్ననగల్గె విద్యతికి తత్పూర్వమ్ము దామోదరుం
డైనాడంట యశోదపట్టి యికధ్యేయంబెల్ల మీరిద్దఋన్

శా॥ అక్షయ్యంబగు శంఖచక్రయుతహస్తాలంకృతిన్ పల్గునీ
నక్షత్రమ్మున సర్వదేవతలు విన్నాణమ్ముగా గొల్వదే, దే
వీ! క్షీరాంబునిధిన్ బ్రసన్నరుచి నావిర్భావమున్ బొంది సం
రక్షింపన్ దొరకొంటి లోకముల సామ్రాజ్యైక సంధాయినీ!

క॥ తొలిజన్మమ్మునందులసీ
దళమున నిన్ బూజసేయ తావక కృపరం

PDF Compressor Pro

ఱల నీజన్మ శుభమ్ములు
కలుగున్ మహాలక్ష్మి తల్లి! కల్యాణమయీ!

ఉ॥ పాయనిభక్తిఁగల్గి నిజభర్తఁగఁ దండ్రిగ నెవ్వరేని నా
రాయణుఁగొల్వ నేర్తురో స్థిరమ్ముగ లక్ష్మిని దల్లిగా మనో
ధ్యేయముగాఁదలంతురో! నుతింతురో! వారికి శ్రీయమబ్బు దీ
ర్ఘాయువుగల్గి సంతతము హాయిసుఖింతురు శ్రీలుపొంగగా

శ్రీ విశ్వావసు ఫాల్గుణ శు. ౫, ౬, శుక్ర స్థిరవారములు
(ది 25-2-66 , 26-2-66) బృందావనము.

స్వస్తి,

మ॥ తనుహృద్భావల నింద్రియప్రతతి చేతన్ బుద్ధిచే నంతరా
త్మను స్వాభావికశక్తియా ప్రకృతి చేతన్ బ్రేరణన్బొంది నే
ననిశమ్మున్ బచలించుచుండు సకలవ్యాపారముల్ నీకె య
ర్పణగావింతు గ్రహింపుమయ్య కరుణాపారీణ నారాయణా

# శ్రీ సూక్తమ్

ఋక్॥ హిరణ్యవర్ణాం హారిణీం సువర్ణరజతస్రజాం
చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదోమ ఆవహా॥

చ॥ మిలమిల కాంతులన్ మెఱయు మేలిమిబంగరు మేనఁబచ్చనై
జెలువము మేలివెన్నెలలు జిందెడు చల్లని మోము దమ్మియున్
వెలయ గళమ్మునన్ బసిడి వెండియ పూలపసందు మాలలున్
గలుగు సువర్ణమూర్తియగు! కల్మిల తల్లిని లచ్చిఁగొల్చెదన్!

PDF Compressor Pro



ఋక్|| తాంమఆవహజాతవేదో లక్ష్మీ మనపగామినీం
యస్యాం హిరణ్యం విన్దేయం గామశ్వం పురుషానహం||

చ|| నిరుపమ సత్కృపానిలయ నీకనుసన్న వెలుంగు నిత్యమున్
స్థిరతరభూరిసంపదలు ధేనువులశ్వములున్ సుహృద్వరుల్
తఱుగని పుత్రపౌత్రులును తావకపాదము లాశ్రయింతు నే
యరమర జెందనీయక గృహమ్మున నిల్వుమ లక్ష్మి నిచ్చలున!

ఋక్|| అశ్వపూర్వాం రథమధ్యాం హస్తినాద ప్రబోధినీం
శ్రియం దేవీముపహ్వయే శ్రీర్మా దేవీ జుషతాం||

మ|| అమితోత్సాహముసత్త్వమున్ గలుగు దివ్యాశ్వమ్ములున్ బూర్వభా
గమునన్ భాసిలి తేరుమధ్యమున శృంగారైక సచ్చిత్ స్వరూ
పముగా వెల్గ కరుల్ కరమ్ముల జయధ్వానమ్ములన్ జేయ సే
వ్యమగున్ నిన్న సమీపలక్ష్మిగ మదిన్ బ్రార్థింతు నశ్రాంతమున్!

ఋక్|| కాంసోఽస్మితాం హిరణ్యప్రాకారామార్ద్రాం జ్వలంతీంతృప్తాం
తర్పయంతీం
పద్మేస్థితాం పద్మవర్ణాం తామిహోపహ్వయే శ్రియం

మ|| స్థిరపద్మాసనమందు పద్మమయకాంతిన్ వెల్గుచున్ మోమునన్
దొరలన్ జిర్ణగవుల్ సువర్ణమయకాంతుల్ చుట్టుప్రాకారమై
పరిసేవింపగ బాలసంద్రపుతడిన్ భాసిల్లి యుష్టారముల్
సరితీర్పంగల పూర్ణరూపిణి మహాలక్ష్మి కటాక్షింపు మా!

ఋక్|| చంద్రాం ప్రభాసాంయశసా జ్వలంతీం
శ్రియంలోకే దేవజుష్టాముదారాం
తాంపద్మినీ మీం శరణమహం ప్రపద్యేఽ
లక్ష్మీర్మేనశ్యతాం త్వాం వృణే||

PDF Compressor Pro



శా॥ రాకాపూర్ణ సుధాకరుల్ బలె యశః ప్రాచుర్యకాంతుల్ దిశల్
ప్రాకన్ లోకములన్ మహేంద్రుడును సంభావించి సేవింపఁగా
ఈకారమ్మున బొల్చు పద్మనివి మత్ హృత్పద్మమున్ జేరి వే
పోకార్పంగదె నాదులేమి జననీ! భోగార్థ సంధాయినీ!

ఋక్॥ ఆదిత్యవర్ణే తపసోఽధిజాతో వనస్పతిస్తవ వృక్షోఽథ బిల్వః!
తస్యఫలానితపసానుదంతుమాయాఽంతరాయాశ్చబాహ్యాఅలక్ష్మీః

మ॥ లలితానంద ఫలప్రదాయినిగ బిల్వంబుద్భవించెన్ తపః
ఫలమై స్ఫాటిక సూర్యకాంతుల కరాబ్జంబందునన్ నీ కృపా
కలనన్ శ్రీఫలముల్ ముదంబొసఁగుచున్ గామ్యార్థముల్ గూర్చి చిం
తలపెల్లార్చి హరింపగాక బహిరంతర్వ్యాప్త దారిద్ర్యముల్!

ఋక్॥ ఉపైతుమాం దేవసఖః కీర్తిశ్చమణినాసహ
ప్రాదుర్భూతోఽస్మి రాష్ట్రేస్మిన్ కీర్తి మృద్ధింద దాతుమే!!

మ॥ అలఘు ప్రాభవకీర్తి మండిత సుధల్ వ్యాపింప మాణిక్య కాం
తులు జిమ్మన్ గృహమందునన్ నవనిధుల్ తూగాడఁగా నీదు ని
స్తుల రాజ్యంబున జన్మమెత్తినటు సంతోషింతు నాపై మహో!
జ్జ్వలకీర్తిన్ సకలార్థ సంపదలనింపన్ వేడెదన్ భార్గవీ!

ఋక్॥ క్షుత్పిపాసామలాంజ్యేష్ఠా మలక్ష్మీం నాశయామ్యహం
అభూతి మసమృద్ధించ సర్వాం నిర్ణుదమే గృహాత్॥

శా॥ అమ్మా! ఆకలిదప్పులాదిగ మనోవ్యాధి స్వరూపంపు పె
ద్దమ్మన్ బైటికి బంపజాలెను మదీయమ్మా గృహమ్మున్ బ్రవే
శమ్మున్ జెందుని నేమమందు మదభీష్టమ్ముల్ సమృద్ధిన్ గొనన్
రమ్మా! లేములబాపి మాగృహము నిండన్ సర్వ సంపత్తులన్!

ఋక్॥ గంధద్వారాం దురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీం
ఈశ్వరీం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియం !!

చ॥ తఱుఁగని పాడిపంటలకు తావు సుగంధముజిమ్ము శ్రీవసుం
ధరవుగ ప్రాణికోటి నిరతమ్ము మనన్ బరిరక్షసేయు యీ
శ్వరివి యెవారికేని సులభమ్ముగ లొంగని పుణ్యధాత్రివిన్
కరముగ్రహించి సౌఖ్యపడఁగా హరిణీ! కృపనింపునాపయిన్

ఋక్॥ మనసః కామ మాకూతిం వాచస్సత్యమశీమహి
పశూనాం రూపమన్నస్య మయిశ్రీ శ్శ్రయతాం యశః!!

మ॥ కలుగుంగాత మదిన్ శుభేచ్ఛ శుభసంకల్పమ్ములున్ వాక్కునన్!
వెలయున్ గావుతసత్యమున్ బశువులున్ మృష్టాన్నముల్ మాగృహ
మ్ములశోభిల్లుత కీర్తి సంపద ధనమ్మున్ ధాన్యముల్ నిండ ని
స్తులభోగమ్ములఁ దేలియాడఁగ స్తుతింతున్ నిన్నె శ్రీ భార్గవీ!

ఋక్॥ కర్దమేన ప్రజాభూతా మయి సంభవ కర్దమ
శ్రియం వాసయ మేకులే మాతరం పద్మమాలినీం!!

ఉ॥ ధారుణి యోగ్యపుత్రుని శతమ్మునఁ దల్లి సుఖించుఁ గీర్తి వి
స్తారమగున్ సుపుత్రవతి తాకమలాసతి కర్దమున్ గనన్
పేరువహించెనంట కృపనింపుము కర్దమ పద్మమాలికా
ధారిణి లక్ష్మితోడ నిరతమ్ము వసింపుము మద్గృహమ్మునన్

ఋక్॥ ఆపస్సృజంతుస్నిగ్ధాని చిక్లీత వసమేగృహే
నిచదేవీం మాతరం, శ్రియంవాసయ మేకులే॥

శా॥ చైతన్యమ్ము విరాజిలన్ బ్రికృ నిచ్చున్ వారుణీదేవతల్
ప్రీతిన్ పీడకసుగ్రహింతురుగ వారిన్ నిల్పుమాయింట చి

PDF Compressor Pro



క్లీతా! క్లేశవిదారి! నీజనని లక్ష్మీదేవితో నీవునున్
చేతోమోదముగొల్ప మాగృహము లక్ష్మీవాసమున్ జేయుమా!

ఋక్॥ ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం పింగళాం పద్మమాలినీం
చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహా!!!

చ॥ చెలువుగ దిగ్గజమ్ములభిషేకమొనర్పఁగఁ బద్మమాలికల్
గళమున సొంపులీనగ జలమ్ములజారిన పచ్చనైన క్రొ
త్తళుకులమేన సుందరతదార్ఢ్యము గల్గియు చంద్రకాంతులన్
వెలయు సువర్ణమూర్తినిదె వేడెద మద్గృహ సీమవర్తిలన్!

ఋక్॥ ఆర్ద్రాం యఃకరిణీం యష్టిం సువర్ణాం హేమమాలినీం
సూర్యాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహా!!

చ॥ వెలయ, గళమ్మునందుఁ గనువిందుగఁ బొందగు హేమమాలికల్
తళతళ పాలసంద్రపు జలమ్ములలేచు. సువర్ణదేహకాం
తులపయి, సూర్యకాంతులునుదోప, కరమ్మునరమ్యమాలయున్
గలుగు సువర్ణమూర్తి యనఁగా జెలువారెడు లక్ష్మిఁగొల్చెదన్!

ఋక్॥ తాంమ ఆవహజాతవేదోలక్ష్మీ మనపగామినీంయస్యాం హిరణ్యం
ప్రభూతంగావో, దాస్యోఽశ్వాన్ విన్దేయం పురుషానహం!!

ఉ॥ నీకరుణా కటాక్షముల నింపెదగావుత మద్గృహమ్మునన్
బ్రాకఁగ, నశ్వగోగణ ధనమ్ములు, ధాన్యము. పుత్రసంపదా

PDF Compressor Pro



నీకము, మిత్రులున్ విడువ నీశతిరమ్మగ, సర్వసౌఖ్యముల్
సేకుఱ, సత్కళానిలయ శ్రీజయలక్ష్మి! యనుగ్రహింపుమా!

## ఫలశ్రుతి

శ్లో॥ నక్రోధో నచమాత్సర్యం నలోభోనాశుభామతిః
భవంతి కృతపుణ్యానాం భక్తానాం శ్రీసూక్తంజపేత్సదా॥

మ॥ స్థిరసంకల్పముతో జపించు జపముల్ శ్రీసూక్తమున్ భక్తిత
త్పరతన్ వారలనింక, క్రోధమును, మాత్సర్యమ్మునన్ లోభముల్
దరియన్ రావు, మనమ్మునందశుభచింతా వృత్తులున్ దోపకే
స్థిరపుణ్యమ్ములభింప, నొందెదరు లక్ష్మి దివ్య సౌభాగ్యముల్

శ్రీ విశ్వావసు ఫాల్గుణ శు ౧౫ సోమవారం ది 7-3-66. ఉత్తర ఫల్గునీ

శ్రీ శ్రీ శ్రీ